అంగన్‌వాడీలకు అద్దె కష్టాలు

- 8 నెలలైనా అందని బిల్లులు
- లబోదిబోమంటున్న అంగన్‌వాడీ సిబ్బంది
- నిధులున్నా చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన



హిందూపురం పట్టణంలో అద్దె భవనంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

హిందూపురం టౌన్: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె కష్టాలు ఎక్కువయ్యాయి. మెజార్టీ అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో టీచర్లు, ఆయాలు సొంత డబ్బులతో, అప్పులు చేసి మరి అద్దెలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది.

184 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే...

అంగన్‌వాడీ వ్యవస్థ ప్రారంభమై దాదాపు 40 ఏళ్ల గడిచినా నేటికి అక్కడక్కడా సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 184 అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇందులో మున్సిపాలిటీ పరిధిలో 67, గ్రామాల్లో 117 ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో రూ.6 వేలు, గ్రామాల్లో రూ.2 వేల చొప్పున అద్దెను చెల్లిస్తున్నారు. అయితే వీటికి సంబంధించి ఈ ఏడాది మే నెల నుంచి అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను అద్దెకిచ్చిన వారు అద్దెల కోసం ఎదురు చూసి అంగన్‌వాడీ కార్యకర్తలపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీనిపై వారు ప్రాజెక్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తామంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరూ అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పులు చేసి మరీ అద్దెలు చెల్లించారు. చాలీచాలనీ జీతాలతో నెట్టుకొస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇది మరింత భారంగా మారింది. అద్దె బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నిధులున్నా.. చెల్లింపులో జాప్యం

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక వైపు అద్దె చెల్లించాలంటూ లేదా ఖాళీ చేయాలని భవనాల యజమానుల నుంచి ఒత్తిళ్ల వస్తుంటే.. మరో పక్క బిల్లుల చెల్లింపుకు నిధులు విడుదలైనప్పటికి అధికారుల జాప్యం చేస్తుండం సిబ్బందికి శాపంగా మారింది. భవనాల యాజమాన్యాల నుంచి మాట పడాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలకు సంబంధించి 15 రోజుల క్రితం ప్రభుత్వం నుంచి నిధులు మంజురయ్యాయి. అయినప్పటికీ ఐసీడీఎస్ అధికారులు వాటికి బిల్లులు చెల్లించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లులు సిద్ధం చేయలేదనే వాదనలు వినిపిస్తున్నారు. ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంతో.. బిల్లుల చెల్లింపులో జాప్యంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బిల్లులు చెల్లించడం లేదు



అంగన్‌వాడీ సెంటర్ అద్దెలు గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. సెంటర్ అద్దెల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. సిబ్బంది బిల్లులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త తమకు వచ్చే రూ.11,500 వేతనంలో అంగన్‌వాడీ సెంటర్ అద్దెలు, గ్యాస్, కూరగాయలు, సెంటర్ కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి. దీంతో మా కుటుంబ పోషణకి ఇబ్బందిగా మారింది. చాలీచాలనీ జీతంతో బతుకుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల కుటుంబాలకు అద్దె చెల్లింపులు భారంగా మారాయి. మరో మూడు రోజుల్లో అద్దె బిల్లులు చెల్లించకపోతే ఆందోళనలకు దిగుతాం.

– లావణ్య, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి

బిల్లులు పెడతాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో అద్దెల చెల్లింపు జాప్యం జరిగిన మాట వాస్తవమే. అంగన్‌వాడీ అద్దెల చెల్లింపుకు నిధులు మంజూరయ్యాయి. నిధులు వచ్చిన మేరకు అద్దెలు ఇవ్వడానికి బిల్లులు రూపొందిస్తున్నాం. రెండు రోజుల్లో బిల్లులను ట్రెజరీలో అందజేస్తాం. సాధ్యమైనంత త్వరగా బిల్లులు చెల్లించేలా చూస్తాం.

– రెడ్డి రమణమ్మ, సీడీపీఓ, హిందూపురం

పరిగిలో పర్యటించిన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



ఊటుకూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్

పరిగి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పరిగి మండలంలో బుధవారం పర్యటించారు. తొలుత మండల కేంద్రంలోని బీరలింగేశ్వర ఆలయ కళ్యాణ మండపంలో జరిగిన కాలువపల్లి ఆదినారాయణ కుమారుడు అశోక్‌కుమార్, మహాలక్ష్మీ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పెద్దిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధరప్ప కుమార్తె మేఘాంజలి, వేణుగోపాల్ వివాహనికి హాజరయ్యారు. ఆ తర్వాత ఊటుకూరు పంచాయతీ పరిధిలోని బసవనహళ్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న విజయేంద్రరెడ్డి, అలాగే ఇంద్రారెడ్డి, ఎర్రగుంటలో అనారోగ్యంతో బాధపడుతున్న సోషల్ మీడియా కార్యకర్త నరేష్ తల్లిని పరామర్శించారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చిక్కన్న, చంద్రారెడ్డి, రామాంజి, నాయకులు సింగారెడ్డి, శివరామిరెడ్డి, రఫీక్, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, గిరి, కోఆప్షన్ మెంబర్ సలీం, విశ్వనాథ్‌రెడ్డి, గఫూర్, నరసింహారెడ్డి, పూల చౌడప్ప, బాబురెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి జయంత్యుత్సవం



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని మాచురాజనహళ్లిలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రతిష్టించిన వాల్మీకి విగ్రహానికి గ్రామస్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని వెండి రథంలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామం ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు మోశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు సచివాలయం ఆవరణలో బుధవారం రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభను నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. గ్రామ సభలో పింఛన్ల కోసం 9, సర్వే సబ్ డివిజన్ కోసం ఒకటి, భూ సమస్యల పరిష్కారం కోసం 3 అర్జీలు రైతులు, ప్రజల నుంచి వచ్చినట్లు తెలిపారు. గ్రామసభలో రైతులు, ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శారదమ్మ, వీఆర్‌ఓ చిరంజీవి, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చేపల చెరువు వేలం

లేపాక్షి: మండలంలోని మైదుగోళం గ్రామ చెరువులో చేపల పెంపకానికి గురువారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ ఆనందకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే పాటదారులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాట పాడాలన్నారు.

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాడిశెట్టి



రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు



రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి

పెనుకొండ: ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుకొండకు చెందిన కాడిశెట్టి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గత 24 సంవత్సరాలుగా ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాల్లో పనిచేసిన కాడిశెట్టి ఉపాధ్యాయ సమస్యల కోసం కృషి చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలోని రొద్దం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎంవీ. కృష్ణారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు నాగశేఖర్, ఎస్.శ్రీనివాసులు, కిష్టప్ప, విజయకుమార్‌నాయక్, డి.శ్రీనివాసులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో నేటి నుంచి 20వ తేదీ వరకూ గ్రంథాలయాధికారులు తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న కవి సమ్మేళనం, 18న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలపై అవగాహన, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



లేపాక్షి: మండలంలోని గోపిందేవరపల్లిలో వెలిసిన తొలిశాంభాదేవి బ్రహ్మరథోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం నుంచి శిరివరంకు వెళ్లే రోడ్డు వరకూ రథోత్సవం సాగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేత్రావతి, గ్రామ పెద్దలు ప్రభాకర్‌గౌడ్, వెంకటప్ప, అశ్వరప్ప, రేవంత్, అనిల్‌కుమార్, చల్లపల్లి మూర్తి, గుట్టెచిక్కన తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

మడకశిరరూరల్: ప్రభుత్వం పే రివిజన్ కమిషన్ అమలు చేసే లోపు మధ్యంతర భృతి ప్రకటించాలని జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బుళ్లసముద్రం పాఠశాలలో ఎస్టీయూ సభత్వా నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ఆర్థిక కార్యదర్శి గోబ్రేనాయక్, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, వివిధ మండల అధ్యక్షులు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

● భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

గౌడ సంద్రమారెమ్మ విగ్రహం చుట్టూ గొర్రెలను ప్రదక్షిణ చేయిస్తున్న కాపర్లు



మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామ సమీపంలో వెలసిన గౌడసంద్రమారెమ్మ అమ్మవారికి కార్తీక బుధవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని గ్రామంలో గ్రామోత్సవం చేశారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు కొబ్బరి కాయలను కొట్టించి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ పొలిమేరలో గౌడసంద్రమారెమ్మ ఉత్సవమూర్తిని ఉంచి గొర్రెలను కాపర్లు అమ్మవారి చుట్టూ ప్రదక్షణలు చేయించారు. ఇలా చేయడం ద్వారా గొర్రెలు, పశువులకు వ్యాధులు దూరం అవుతాయని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటూ గ్రామానికి మంచి జరుగుతుందని భక్తులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

హిందూపురం అర్బన్: హిందూపురం ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య, సిబ్బంది బుధవారం హిందూపురం లేపాక్షి కర్ణాటక సరిహద్దు దారుల్లో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగానే లేపాక్షి మండలం గొంగటిపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి 48 టెట్రా ప్యాకెట్లు బైక్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే హిందూపురం మండలం కొటిపి వద్ద కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తున్న రామకృష్ణప్పను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 123 టెట్రా ప్యాకెట్లు పట్టుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు ఫరూక్, పృథ్వీరాజ్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

ఖాతా తెరిచేందుకు ప్రత్యేక శిబిరాలు

మడకశిరరూరల్: ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతాలు తెరవడానికి, ఆధార్ లింక్ సులభతరం చేయడానికి ఈ నెల 15 వరకూ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) లబ్ధిదారులకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు హిందూపురం తపాలాశాఖ సూపరింటెండెంట్ విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మెళవాయిలో పర్యటించి ఖాతాలు తెరవడం, ఆర్థిక ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

‘అపార్’ను త్వరగా పూర్తి చేయండి



అమరాపురంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మారుతి ప్రకాష్, ఎంఈఓ – 2 వెంకటరమణనాయక్, మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అపార్ ఐడీ జనరేట్ చేయడానికి గల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ సెంటర్‌లో హెచ్‌ఎంలు ఇచ్చిన పేరు మార్పు, జనన ధ్రువీకరణ పత్రాలు చెల్లవని చెబుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఎంఈఓ 2 తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

అగళి: మండల పరిధిలోని దాసేగౌడనహళ్లి చెందిన మాజీ డీలర్, వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోవిందప్ప (55) గుండె పోటుతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప బుధవారం మృతుడి స్వగ్రామానికి వెళ్లి గోవిందప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జేసీఎస్ మండల కన్వీనర్ మహేంద్రప్ప, పార్టీ కన్వీనర్ స్టుడియో శ్రీనివాస్, ఎంపీపీ భర్త కామరాజు, పార్టీ శ్రేణులు తదితరులున్నారు.

కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున

రొళ్ల: ఒంటరిగా ఉన్న మహిళలు కుటుంబాలను అభివృద్ధి చేసుకొని పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు కృషి చేయాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం రొళ్ల ఆర్డీటీ ఏరియా కార్యాలయం ఆవరణలో రొళ్ల, అగళి మండలాల్లోని 43 మంది వితంతువు మహిళలకు ఒక్కొక్కరికీ 12 కిలోల బియ్యం, 4 కిలోల రాగి, కందిబ్యాళ్లు, బెల్లంతో పాటు రెండు లీటర్ల పామాయిల్, నాలుగు సబ్బులను పంపిణీ చేశారు. అంతకు ముందు ఆర్డీటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట

గుడిబండ: మండల పరిధిలోని ఫళారంలోని శివాలయం ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

సాక్షిబృందం: గ్రామ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు గ్రామస్థాయి అధికారులకు బుధవారం కూడా శిక్షణ ఇచ్చారు. గ్రామ సమగ్రాభివృద్ధికి దోహదం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓలు సూచించారు.

ఘనంగా కలశ స్థాపన



కలశాలకు పూజ చేస్తున్న అర్చకులు

అమరాపురం: మండలంలోని పేలుబండ కొండలో వెలసిన లక్ష్మీ రంగనాథస్వామికి కార్తీక మాసం సందర్భంగా కలశ స్థాపన కార్యక్రమాన్ని బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్చరణాల మధ్య కలశ స్థాపన, మహా కుంభాభిషేకం, ఉప కుంభమేళా, అగ్ని హోమం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ రకాల పూలతో స్వామి వారిని అలంకరించి అభిషేకాలు నిర్వహించారు.

మాలధారులకు అన్నదానం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయంలో అయ్యప్ప మాల దారులకు ఏజీపీ భాస్కర్‌రెడ్డి బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలంతో రూ.4.65 లక్షల ఆదాయం

రొళ్ల: మండలంలోని ఎం.రాయాపురం పంచాయతీ పరిధిలోని నాలుగు చెరువులను చేపల పెంపకానికి బుధవారం వేలం వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. ఎం.రాయాపురం చెరువును కరియన్న రూ.1.60 లక్షలకు, హనిసేకుంట చెరువును దాసప్ప రూ.1.22 లక్షలు, చర్లోపల్లి చెరువును వన్నప్ప రూ.30 వేలకు, సీఎం ఘట్ట చెరువును కంబన్న రూ.1.53 లక్షలకు చెరువులను ఒక సంవత్సరం పాటు చేపలు పెంపకానికి వేలం దక్కించుకున్నారని పేర్కొన్నారు.


బైబిల్ మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

పెనుకొండ: పట్టణంలో బైబిల్ మిషన్ చర్చిలో బుధవారం యేసు రెండో రాకడ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ సుధాకర్ బైబిల్ గ్రంథంలోని యేసు రెండో రాకడ వచనాలను బోధించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి జీవించాలని కోరారు.

మొక్కలు నాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

హిందూపురం: పట్టణ పరిధిలోని మేళాపురం దీప్తి ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మొక్కల ప్రాముఖ్యతపై పోస్టర్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పలువురిపై పోక్సో కేసు నమోదు

పెనుకొండ రూరల్: మైనర్ బాలికను అపహరించుకెళ్లి, ఓ యువకుడితో వివాహం చేసిన కేసులో యువకుడిపై, సహకరించిన మరో ఆరుగురిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు కియా పీఎస్ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన మైనర్ బాలిక ఇటీవల పెనుకొండ మండలం గుట్టూరు గ్రామంలోని తమ సమీప బంధువులు ఇంటికి వచ్చింది. ఈ నెల 4న ఆమె కనిపించకుండా పోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బృందాలుగా విడిపోయి మైనర్ బాలిక కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బాలికను ధర్మవరం పట్టణానికి చెందిన అజయ్ అపహరించుకెళ్లి పెళ్లి చేసుకున్నట్టుగా గుర్తించి బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వివాహానికి సహకరించిన పోతులయ్య, లక్ష్మీనారాయణనూ అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.